కథానిక

# ధనస్వామ్యం

ఆలూరు భుజంగరావు

అసలే ఆ బజారు ఇరుకు. బజారుకు రెండు వైపులా గాలినీ, వెలుగునీ రానీయకుండా రెండంతస్తులవీ, మూడంతస్తులవీ మేడలు గర్వంగా తలలు ఎత్తుకుని ఆకాశంలోకి చూస్తున్నై. ఆ పేటకంతటికీ ఎటుపోవాలన్నా అదొక్కటే మార్గం అవడంవల్ల ఆ బజారు ఎప్పుడూ జనసమ్మర్దంగా వుంటుంది.

బజారంతా ఇరుగ్గా, సందడిగా వుంది. ఇనస్పెక్టరుగారి జవాను కిష్టప్ప ఉసిగా నడిచి పోతున్నాడు. మనుషుల్నీ, సైకిళ్ళనీ, బండ్లనీ వెనక పడేస్తూ నడిచిపోతున్నాడు ఏక దీక్షగా. కోపం, పట్టుదల, అభిమానం—ఇవన్నీ వాడి మొహాన్ని బాగా ఎరుపురంగుదిద్దినట్టు చేశాయి.

ఇనస్పెక్టరుగారి ఇంట్లో వాడి పని- బజారు సామాన్లు పట్టుకురావడం, పిల్లల్ని ఎత్తుకోవడం. వాళ్ళ ఇంట్లోవున్న వాళ్ళకి అనుక్షణమూ బజారుతో అత్యవసరమయినపని ఏదోవొకటి వుంటూనే వుంటుంది. పెద్దమ్మాయికి నిన్న గొప్పగా కనుపించిన గులాబిరంగు రిబ్బను ఇవ్వాళ అసహ్యంగా వుంటుంది. వెంటనే కాఫీరంగు రిబ్బను కోసరం కిష్టప్ప బజారుకు రావలసిందే. రెండో కుర్రవాడి పలక ఆక్షణం వరకూ పెద్దవాళ్ళు తన్నినా పగలకుండా గట్టిగావుండి కిష్టప్ప మొత్తకు అనుకుని కూర్చోవడంచూసి ఇట్టే పగిలి వూరుకుంటుంది. అప్పుడు పలకకోసరం బజారుకు రావలసిందే.

ఉదయంనుంచీ ఓ డజను సార్లయినా బజారుకు తిరిగాడు. అన్నీ అనవసరమైన అత్యవసరాలే. సాయంత్రం కాస్త పిల్లను ఎత్తుకున్నట్టు ఎత్తుకుని అరుగుమీద చతికిల పడదామని పోయాడు. ఇనస్పెక్టరుగారి బావమరిదికి ట్వీడ్ సూటుమీదా, బ్రవున్ కోటుమీదా అకస్మాత్తుగా మనసు పుట్టింది. వెంటనే కిష్టప్ప బజారుకు, ఇస్త్రీ కొట్టు రాలసిన అవసరం కల్గింది.

కిష్టప్ప తన వూహాలకు అందిన పరిధిలో తర్కిస్తూ నడుస్తున్నాడు. 'అంత డాబుసరా? మనిషి కొంచెం కూర్చోవడంచూస్తే కళ్లలో నిప్పులు పోసుకుంటారు.. కాళ్ళు పీక్కుపోతున్నైకదా? ఆ రెండు పెట్టెల బట్టలూ పనికిరావుకామాలు? ఇవేకావాలిట...ముదనష్టపు నాయాలు. ఈడు వచ్చాడంటే వూరకే తిప్పుతాడు బజార్లంట. అయినా ఈడు యియన్నీ ఏసుకుని చేసేదేమిటో? క్లబ్బుకుపోతాడు, చీట్లు ఆడతాడు. అంతేనా? ఆ మాత్రానికి ఆ పాత పనికిరాదూ? ఇయ్యేకావాలేం? ఒకమాటు మా కుర్రోడు చీట్లు ఆడుతుంటా పోలిసోండ్లు ఎముకలు ఇరిగేట్లు తన్నారు. మరి ఈళ్ళు ఆడితే బాగుందిగావును?' అనుకుంటూ కోపమూ, నిర్లక్ష్యమూ కలిసి తెచ్చిపెట్టిన బలంతో చక చకా నడిచాడు ఇస్త్రీకొట్టుకు.

వెంకన్న ఇస్త్రీషాపు ఆ బజారులోవున్న కింది వరుసలో ఒకచిన్నగది. మేడ పైభాగంలో ఇంటి యజమానులు అన్ని సౌకర్యాలతోటీ కాపురాలు వుంటారు. మధ్యభాగాలు, వాళ్ళు నిర్ణయించిన అద్దె పెట్టగల ధనికులకు ఇస్తారు. కిందిగదులు బీదలకూ, చిన్న చిన్న దుకాణాలకూ అద్దెలకు ఇస్తుంటారు.

వెంకన్న కిందివరసలో ఒక చిన్న గది తీసుకున్నాడు పనికి. తన ఇస్త్రీగది రెండు గజాల పొడుగూ, గజన్నర వెడల్పూ వుంటుంది. ఒక పక్క బల్లమీద ఇస్త్రీ చేసినబట్టలు బొత్తులుగా పెట్టి వున్నై. రెండోవైపు పెట్టె రుద్దే బల్లా, దానిక్రింద మైలబట్టలు వున్నై. ఒక మనిషి కష్టంగా ఆ మధ్యస్థలంలో నిల్చోడానికి సరిపోతుంది.

నెలరోజులు తిరక్కుండానే వెంకన్న బాగా ఇస్త్రీ చేస్తాడు అనే పేరువచ్చింది పేటలో. అందుకనే ఇనస్పెక్టరుగారి బావమరిది ఈ సారి బట్టల్ని ఇక్కడ వేయించాడు. కొట్టుకు తాకిడీ ఎక్కువగావడంవల్ల, వెంకన్న రంగాయిని పది హేను రూపాయల జీతానికి కుదుర్చుకున్నాడు పెట్టె రుద్దడానికి.

అప్పుడు గదంతా చీకటిగా వుంది. రంగాయి కొవ్వువత్తి వెలిగించి, బట్టలు ఇస్త్రీ చేస్తున్నాడు. గది గుమ్మంలో అయిదారుగురు బట్టలకోసరం నిల్చుని తొందర చేస్తున్నారు. అదేపనిగా పొద్దుటి నించీ పెట్టె రుద్దుతుండటంవల్ల రంగాయి బాగా అలిసిపోయాడు.

ఒళ్ళంతా చెమటలు పోయడంవల్ల వేసుకున్న రబ్బరుబనీను ఒంటికి అంటుకుపోయింది. కళ్లు లోప లికి పీక్కుపోయివున్నై. బలవంతాన ఓపిక తెచ్చు కుని, నీరసంగా ఇస్త్రీ చేస్తున్నాడు.

'ఏవీ, ఇంకా కాలేదా?'

'ఎప్పుడయ్యా ఇస్తావు?'

'చాలు చాలు లేవయ్యా? గంటసేపయింది వచ్చి.'

అంటున్నారు బయట బట్టలకోసరం నిల్చున్న వాళ్లు. వాళ్ళ చీదరింపులూ, దౌర్జన్యాలు వింటున్న కొద్దీ రంగాయికి కోపమూ, పౌరుషమూ ఎక్కు వవుతోంది.

తనలో వున్న అసహ్యాన్నంతా ధ్వనింపచేస్తో 'కూస్తె అసంట నిలువోండయ్యా, గాల యినా ఆడద్దీ' అన్నాడు గొంతు బాగా పెద్దదిచేసి. కొం చెంసేపు పెట్టె రుద్దటం ఆపి, వేడికి కమలిపోతున్న చేతిని ఒకమాటు చూసుకుని మంచిపెట్టె అయినా లేదుగందా ? అనుకున్నాడు - మనస్సులోనే వెంకన్నను తిట్టుకుంటో.

మళ్లా పెట్టె రుద్దడం ప్రారంభించాడు. ఈ సారి ఇంటిదగ్గిర వసారాలోనో, మెల్లాలోనో మంచంవేసుకుని కులాసాగా కబుర్లుచెప్పే వెంకన్న వాడి ఆకలిచూపులకు కనుపించసాగాడు.

'పొద్దునసంగా పోయాడు ఇంతవరకూరాలేదు. తిండికయినా పంపించలేదు. దొంగనాయాలు పూర్తిగా కడుపునిండా సారాయి పట్టించినట్టు న్నాడు. ఇంక నేనుచస్తే యేం? బ్రతికితే యేం ? దేంతోనో సరాగాలు ఆడుతుంటాడు. ఏమో ! అట్టా తాగి తందనాలాడి, సరాగాలు ఆడకపోతే? ఈళ్ళంతా నన్ను పట్టుకు పీక్కు తింటున్నారు కదా ? నాకు మరీ గీరెక్కిందో ! తలుపుతాళంవేసి కాలికి బుద్ధిసెపుతా. ఈడెంతచేసూ ? ఈడి జీతం ఎంతచేసూ !'

రంగాయి ఆలోచనలు తెగకుండానే బయట నుండి గంభీరస్వరం వినిపించింది. 'ఏరా! యీళ్ళం దర్నీ ఇట్టాగే నిల్సుండబెట్టావు.'

రంగాయి తలెత్తిచూశాడు. వచ్చింది వెంకన్న. ఒళ్లంతా మండిపోయింది. 'కూటికయినా పోనీయ లేదేం?' అందామనుకున్నాడు. కాని అనలేక పోయాడు.

'ఏదీ! ఏమాత్రం వచ్చింది?' అంటో కూట్లో వున్న డబ్బుల్ని తీసుకుని వెళ్లిపోచూడు వెంకన్న.

తాగడానికి మళ్లీ ఎల్తాండాడు' గుడ్లు తేలేసి అనుకున్నాడు రంగాయి.

ఇంతలోనే కిష్టప్ప లోపలికి వచ్చాడు. 'ఏవీ? బట్టలు' గర్జిస్తున్నట్టుంది గొంతు. బట్టలు రెడీగా లేకపోతే వాడిపని పడదామని ముందే నిర్ణ యించుకు వచ్చాడా అనిపిస్తున్నది వాడి వాలకం.

'ఇయిగో, డబ్బిచ్చి తీసుకుపో' అన్నాడు రంగాయి. రూపాయి కాగితాన్ని చేతిలోపెడుతో, గుడ్డల బొత్తిని చేతిలోకి తీసుకున్నాడు కిష్టప్ప.

'వాటన్నింటిని పెట్రోలువేసి చెయ్యమంటివే? రూపాయే యిస్తావేం?' అన్నాడు రంగాయి, తరు వాత వెంకన్నచేత చీవాట్లు తినవలసి వస్తుందేమో అని భయపడుతో.

'ఇవి ఎవరివో తెల్సా? ఇనస్పెక్టరుగారి బావ మరిదివి. ఒళ్లు దగ్గిరపెట్టుకో? నీ కొట్టూ, నీవూ కూడా ఎగరగలరు' అన్నాడు కిష్టప్ప.

రంగాయికి డబ్బులు తక్కువ తీసుకోవడం యే మాత్రం యిష్టంలేదు.

'ఎవడయినా కానీ! డబ్బులు అక్కడపెట్టి గుడ్డలు ముట్టుకో?' అన్నాడు రంగాయి.

మళ్లీ అర్థరూపాయికోసరం ఇంటికి పోవడం కష్టమయిన విషయం. పైగా, అయ్యగారు క్లబ్బుకు పోవడానికి బట్టకోసరం ఎదురు చూస్తుంటారు.

'ఏరోయి,అయ్యగారినేమాటలుమిగుల్తున్నావు

'ఇవి ఎవడిసొమ్మనుకున్నావు, డబ్బులేకుండా బట్టలు తీసుకుపోవడానికి?' రంగాయి కోపంగానే సమాధానం చెప్పాడు.

మాటలు బాగా ముదిరినై.

రంగాయి చెంపమీద కిష్టప్ప యీడ్చికొట్టి రూపాయి అక్కడ పారేసి బట్టలు పట్టుకు పోయాడు.

దగ్గిరున్న నలుగురూ వ్యవహారం యింతవరకూ వస్తుంది అనుకోలేదు. తరవాత వచ్చి ఓదార్చటం ప్రారంభించారు.

లేకపోయినా మీసాల్ని మెలిపెడుతో 'యీడి పనిమా ఎంకన్న వుంటే తెలిసేది' అన్నాడు ఏడుపుగొంతుతో రంగాయి.

ఎవరు యెవరికోసం కొట్టినట్టు? ఎవరు యెవరికోసం దెబ్బతిన్నట్టు? వాళ్లకి యీ ఆలోచనే లేదు.

# 'ఇవి కాదోయ్ చరిత్ర కర్థం'

వేదవతి

పంపా ప్రవంతిక ఘోష పెడుతోంది.

ఒడ్డున నుంచుని చూస్తున్న నాకు ఒళ్ళు పులకరించింది. ఆ అనంత ఘోషలో ఏ మధుర సంగీతాలు దాక్కున్నాయా అని ఆలోచిస్తున్నాను.

తూర్పున చంద్రబింబం ఉదయించింది. పరవళ్లు తొక్కుతూ పరిగెత్తే పంపానది చిఱు కెరటాలలో వెన్నెల చిందులు తొక్కుతూంది. ఎన్ని వేల సంవత్సరాలనాటిదో యీ పంపాప్రవంతిక! ఈ హంపీక్షేత్రంలో చేతి సాధనాలతో కొండలు తొలిచి, శిలలు నునుపులు తీర్చి, అద్భుత శిల్పాలు చెక్కిన ఆ దినాల్లోకూడా, యీ 'పంప' యిట్లాగే శీకర తుషారాలు చల్లుతూ నిర్లక్ష్య భావంతో ప్రవహించింది కాబోలు! చరిత్రలో కరిగిపోయిన అనేక ఘట్టాలు సుళ్ళుతిరిగే యీ కెరటాలు అవగతం చేసుకున్నాయి కాబోలు!

భావాల కంతులేదు. జ్యోత్స్నానందంతో హృదయం నిండిపోయింది. ఒక్కసారి కళ్ళు మూసుకుని ఆ నాటి ఆంధ్రుల వైభవాన్నంతా స్మరించుకున్నాను. 'చావలేదు. చావలేదు. ఆంధ్రుల మహోజ్వల చరిత్ర'- అన్న రాయప్రోలు ప్రబోధం జ్ఞాపకం వచ్చింది. నాలోని తెలుగు రక్తం ఉప్పెనలాగా ఒక్కసారి పొంగిపోయింది. 'ఎవరక్కడ?' అని సింహ గర్జనలాటి స్వరం నిశ్శబ్దాన్ని చీల్చుకుంటూ వినవచ్చింది. ఉలిక్కిపడి వెనుతిరిగి చూశాను. అజాను బాహువయిన ఒక ముదుసలి విగ్రహం హంపీ శిల్పాల్లోంచి నా వయిపు నడిచివస్తూంది. ఆ కొండగుహాల్లో చెక్కిన ఒక శిలావిగ్రహం చైతన్యం కలిగి యిలా కదిలి వస్తుందా అనిపించి ఒళ్ళు జలదరించింది. తన్మయత్వంలో ప్రకృతిని చూస్తున్న నేను నిర్విణ్ణతతో అట్టె నిలిచిపోయాను. 'ఏమిటి చూస్తున్నావు పిల్లా!' అన్నాడు బోసినోటితో తాత.

"హంపీశిల్పాల వైభవాన్ని" అన్నా గొంతు పెగుల్చుకుని 'హంపీశిల్పాల వైభవాన్ని'-హంపీ శిథిలాలు ప్రతిధ్వనించాయి నన్ను వెక్కిరించినట్లుగా. తాత నెరిసినగడ్డం సవరించుకుంటూ చిఱునవ్వునవ్వాడు. ఆ నవ్వులో ఎన్నో వింతభావాలు స్ఫురించాయి నాకు. 'హంపీ శిల్పాల వైభాన్ని చూస్తున్నావా పిల్లా!' తాత కళ్ళు తమాషాగా మెరిశాయి ఒక్క క్షణం నిశ్శబ్దంలో కరిగిపోయింది.

'శిథిలాలయిన యీహంపీ ప్రాంతాల్లో కరడుగట్టిన ఆంధ్రుల కళాప్రావీణ్యాన్ని చూద్దువుగానిరా 'అంటూ దారితీశాడు. నిశ్శబ్దవాతావరణంలోకి చీల్చుకుపోతున్న ఆ సమున్నత విగ్రహాన్ని మంత్ర ముగ్ధలా వెంబడించాను.

యంత్రసహాయంలేకుండా, మానవహస్తాలతో నిర్మించబడ్డ ఆ శిల్ప వైచిత్ర్యాలను చూస్తూ నన్ను నేనే మరిచిపోయి నిలబడ్డాను. ఏ దివ్యతమ లోకాల్లోనో విహరిస్తున్నట్లనిపించింది నాకు